క్లుప్తంగా

లక్ష్యంతో చదవాలి


సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం..

భద్రాచలంటౌన్: యువత ప్రతి ఒక్కరు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా చదివితే ఏదైన సాధించవచ్చని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. పట్టణంలోని ఎంపీ కాలనీకి చెందిన యువకులు డీఎస్సీలో ఉద్యోగాలు సాధించన సందర్భంగా వారిని కాలనీ వాసులు, యువత ఆదివారం ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తెల్లం మాట్లాడారు. సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులది కీలక పాత్రని, విద్యార్థులకు ఉన్నత విద్య బోధించి దేశానికి గొప్ప పౌరులను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నక్కా ప్రసాద్, రాము, నవాబ్, లోకేష్, రాజా కిరణ్, విజయ్, ప్రేమ్, బాలరాజు, హరీష్, అంజనరావు, తేజ పాల్గొన్నారు.

నిరుపేదలకే ఇళ్లు ఇవ్వాలి

కరకగూడెం: అర్హులైన నిరుపేదలందరికీ రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లలు కేటాయించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ మండల కమిటీ కార్యవర్గ సభ్యురాలు కొమరం మల్లక్క అధ్యక్షతన రేగళ్ల గ్రామంలో జరిగింది, పాల్గొని మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికార పార్టీ నాయకుల జోక్యం లేకుండా ఉండాలని కోరారు. నిజాయితీగా ఇళ్లలు ఇవ్వదలుచుకుంటే పార్టీ కార్యకర్తలతో కమిటీలు ఎందుకని ప్రశ్నించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న మండల కార్యదర్శి కొమరం కాంతారావు మండల కమిటీ సభ్యులు సర్ప సత్యం బిలపాటి శంకరయ్య కనితి రాము కోవాసి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మీడియా కమ్యూనికేషన్స్ కన్వీనర్‌గా దేవా

దుమ్ముగూడెం: టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని కే.లక్ష్మీపురం గ్రామానికి చెందిన కనుబుద్ది దేవా నియమితులయ్యారు. ఈ మేరకు చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవా మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రతీ గడపకు చేర్చేలా కృషి చేస్తానన్నారు. కాగా, ఆయనను ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ఆదివారం సన్మానించగా, నాయకులు చింతిరేలా రవికుమార్, వీరమాచినేని వినీల్, పరిమి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారుల సంఘం ఎన్నిక

చండ్రుగొండ: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర మలిదశ ఉద్యమకారుల ఉమ్మడి మండల కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా గాదె లింగయ్య, ఎస్‌కె.జాఫర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఉద్యమకారులను స్వరాష్ట్ర యోధులుగా గుర్తించాలని, ప్రతి ఉద్యమకారుడికి పింఛన్, ఇంటిస్థలం, ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వ పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడిగా వేముల హరీష్, కోశాధికారిగా ఎస్‌కె.అన్వర్, సహాయ కార్యదర్శిగా ఎండి.జాకీర్, సభ్యులుగా పరికూటి వెంకట్రావ్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌కె.ఉమర్‌లతోపాటు పలువురిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు రామిశెట్టి సైదయ్య, సుంకర రామారావు, ఆకుల శ్రీనివాస్, దుంప అర్జున్, ఎండీ నాబీద్, రాజా, రాము, అబ్బాస్ అలీ పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

గుండాల: లాభాపేక్ష లేకుండా సమాజంలోని పేదలకు సేవ చేయాలని గుండాల సీఐ రవీందర్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్ సభ్యులు, కరకగూడెం గ్రామీణ వైద్యులు షేక్ సోందుపాషా ఆధ్వర్యంలో ఆళ్లపల్లి మండల పరిధిలోని అడవిరామరం గ్రామంలోని వలస ఆదివాసీ కుటుంబాలకు దోమ తెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో ఆపదలో ఉన్న పేదలకు ఆసరాగ నిలబడే వ్యక్తులు అవసరమని అన్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు సోందుపాషా మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి రానున్న రోజుల్లో పేదలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు షేక్ వసీం అక్రం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామ సమీపంలోని చిలకల గండి ముత్యాలమ్మ తల్లి ఆలయం, ఇదే గ్రామంలోని శ్రీ యంత్ర రాజసహిత కాశేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు చేశారు. ముత్యాలమ్మ తల్లిను భక్తులు దర్శించుకొని వివిధ రకాల పూజలు చేసి, నైవేధ్యాలు సమర్పించారు. అలాగే కార్తీక మాసం సందర్భంగా శ్రీ యంత్ర రాజసహిత కాశేస్వార స్వామి ఆలయంలో మహిళలు, యువతులు పూజలు చేశారు.

టీకాతో 'గాలికుంటు'కు చెక్!

- నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్
- ఆరు నెలలకోసారి కార్యక్రమం
- సద్వినియోగం చేసుకుంటే రైతులకు మేలు


పినపాకలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పశు వైద్యాధికారిణి శిరీష

కరకగూడెం: గాలి కుంటు వ్యాధి అనేది బాసిలస్ అంథ్రాసిస్ అనే బ్యాక్టీరియాకు సంబంధించిన తీవ్రమైన ఇన్ఫెక్షన్. ఇది ప్రధానంగా పశువులను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధి వల్ల పశువులకు నోరు, నాలుక, గిట్టలు, కాలు వంటి భాగాలలో పుండ్లు ఏర్పడతాయి. ఫలితంగా వాటికి తినడం, తాగడం కష్టమవుతుంది. దేశవాళి పశువుల్లో కన్నా సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కలుషిత ఆహారం, నీరు తాగడం వల్ల కూడా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. వ్యాధిగ్రస్తుల నుంచి ఆరోగ్యవంతమైన పశువులకు నేరుగా లేదా పరోక్షంగా ఈ వ్యాధి వ్యాపించే అవకాశం లేకపోలేదు.

వ్యాధి లక్షణాలివి..

- నోరు, నాలుక, గిట్టలు, కాలు వంటి భాగాల్లో పుండ్లు ఏర్పడటం
- జ్వరం, అలసట, ఆహారం తినకపోవడం
- పాలు ఉత్పత్తి తగ్గుదల, నోటి నుంచి చొంగ కారడం
- చర్మంపై గాయాలు లేదా ఉబ్బులు ఏర్పడటం
- శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తడం

నష్టాలెన్నో..

గాలికుంటు వ్యాధితో తీవ్రమైన పరిస్థితుల్లో పశువులు చనిపోతాయి. అదేవిధంగా ఈ వ్యాధి వల్ల పశువుల పాల ఉత్పత్తి తగ్గుతుంది. పశువుల మరణం, పాల ఉత్పత్తి తగ్గుదల వల్ల రైతులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. ముఖ్యంగా రైతులు గాలి కుంటు వ్యాధిని ముందుగా గుర్తించి చికిత్స చేయడం చాలా ముఖ్యం. వ్యాధి తీవ్రమైన దశకు చేరుకునే లోపు వైద్యులను సంప్రదించడం మంచిది.

నివారణ చర్యలు..

గాలి కుంటు వ్యాధిని నివారించడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గం టీకాలు వేయించడం. పశువైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. పశువుల గణాలు, నీటి తొట్టెలు మొదలైన వాటిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలి. కలుషిత ఆహారం, నీరు తాగకుండా చూసుకోవడం మంచింది. వ్యాధిగ్రస్తులను ఆరోగ్యవంతమైన పశువుల నుండి వేరుగా ఉంచాలి. వ్యాధి సోకిన పశువుల పాలను దూడలకి తాగించకూడదు. కాలిగిట్టలు మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి, ఈగలు వాలకుండా వేపనూనె రాయాలి.నోటిలోని పుండ్లకీ గ్లిసరిన్, బోరిక్‌పౌడర్‌ని కలిపి పుయ్యాలి. పశువుల పాకని క్రిమిసంహారక మందులతో, వాషింగ్‌సోడాతో కడగాలి. చనిపోయిన పశువులని సున్నపు గోతిలో పూడ్చాలి.

14 వరకు స్పెషల్ డ్రైవ్..

ఈ క్రమంలో గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకా వేసే కార్యక్రమాన్ని పశు వైద్యశాఖ జిల్లాలో అక్టోబర్ 15వ తారీకు నుంచి ప్రారంభించారు. ఈ నెల 14వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఈ టీకాలను ప్రతి ఆరు నెలకు ఒకసారి వేస్తారు. అంతేకాకుండా అధికారులు, పశు వైద్య సిబ్బంది గ్రామాల్లో ఒక రోజు ముందుగా డప్పు చాటింపు చేసి రైతుల ఇంటి వద్దకు వెళ్లి పశువులకు టీకాలను ముమ్మరంగా వేస్తున్నారు.

అవగాహన కల్పించాలి



గాలికుంటు వ్యాధి గురించి అధికారులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. టీకాల ప్రయోజనాలను, అవసరాలు, వాటి పనితీరును ప్రజలకు తెలియజేస్తే ఎంతో మేలు. గ్రామస్థాయిలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి రైతులకు బాసటగా నిలవాలి.

– పోలెబోయిన స్వామి, రైతు, పాపాయిగూడెం

నివారణ మార్గాలను వివరించాలి



గాలికుంట వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేసి పశు వైద్య సిబ్బంది వ్యాధి ప్రభావం, నివారణ మార్గాలను రైతులకు వివరించాలి. కేవలం టీకాలు వేస్తే సరిపోదు. పశు వైద్యాధికారి గ్రామాల్లో పర్యటించి రైతులకు పశువుల్లో సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి.

– గొగ్గలి నరేందర్, రైతు, కరకగూడెం

సద్వినియోగం చేసుకోవాలి



గాలికుంటు వ్యాధి పశువులలో చాలా సాధారణంగా కనిపించే ఒక వైరల్ వ్యాధి. ఈ వ్యాధితో పాల ఉత్పత్తి తగ్గి, పశువులు బలహీనపడి చనిపోయే ప్రమాదం కూడా ఉంది. ఈ పరిస్థితిల్లో వ్యాధి నివారణకు వేసే టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– జాటోత్ వాసంతి, కరకగూడెం పశు వైద్యాధికారిణి

ఐక్యంగా ముందుకు సాగాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు

భద్రాచలంటౌన్: రాష్ట్రంలోని బీసీలందరూ కులాలను పక్కన పెట్టి బీసీలుగానే ముందుకెళ్లాలని బీసీ సంఘం జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. భద్రాచలం పట్టణంలోని గోల్డ్ స్మిత్ కాలనీల వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం 30 కులాలకు చెందిన బీసీ సంఘం నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలకు న్యాయం జరగట్లేదని, ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటు చేసి బీసీలకు ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో బీసీలనే ఎన్నుకునే విధంగా అందరం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశ అనంతరం హడక్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా బొల్లిశెట్టి రంగారావు, కోకన్వీనర్‌గా తంమళ్ళ వెంకటేశ్వరరావుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకట నరసయ్య, మల్లెల రామనాథం, రవికుమార్, సుబ్బారావు, శాంతారావు, నరసింహా చారి, నాగేశ్వరరావు, మల్లు యాదవ్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

దమ్మపేట: మండలంలోని నాయుడుపేట, లింగాలపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం ఏర్పడుతుందని దమ్మపేట ఏఈ సాయికిరణ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నాయుడుపేట, లింగాలపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని 33 కేవీ ఫీడర్‌కు మరమ్మతులు నిర్వహించాల్సిన కారణంగా సోమవారం(నేడు) ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలియజేశారు. రైతులు, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

ఇన్‌చార్జ్ ఏఈఓ నియామకం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో ఏఈఓగా కత్తి శ్రీనివాస్‌ను ఈఓ రమాదేవి నియమించారు. ఆలయంలో మొదట ఏఈఓగా పనిచేస్తున్న శ్రవణ్‌కుమార్ సస్పెండ్ కావడంతో ఆ పోస్టు గత కొద్ది నెలలుగా ఖాళీగా ఉంది. రెండవ ఏఈవోగా భవాని రామకృష్ణ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. దీంతో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న కత్తి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జ్ ఏఈవోగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఈఓ ఉత్తర్వులను ఆదివారం జారీ చేశారు.

ఎన్యూమరేటర్లకు నేడు శిక్షణ

అశ్వారావుపేటరూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎన్యూమరేటర్లకు నేడు (సోమవారం) శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. అశ్వారావుపేట రైతు వేదికలో మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే ఈ శిక్షణకు ఇప్పటికే ఎంపిక చేసిన 118 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. ఈ నెల 6వ తేదీ నుంచి జరిగే సర్వేను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు.

అమరులు చిరస్మరణీయులు

ములకలపల్లి: ప్రజా ఉద్యమాల్లో ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరవీరులు సదాచిరస్మరణీయులని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లాకమిటీ సభ్యుడు కల్లూరి కిషోర్ అన్నారు. మండలపరిధిలోని కంపగూడెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన అమర వీరుల సంస్మరణ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. చలమన్న, రామన్న, ఎలకం కన్నయ్య, సున్నం శ్రీనె, సున్నం గోపన్న, ఊకే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంతాపం..

మణుగూరురూరల్: మున్సిపాలిటి పరిధిలోని వితల్‌రావునగర్ ప్రాంతానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ దేశబోయిన మల్లీశ్వరీ అనారోగ్యంతో శనివారం మృతి చెందగా.. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం వారి నివాసానికి వెళ్లి మల్లీశ్వరి భౌతికకాయానికి నివాళ్లర్పించారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు కొర్సా ఆనంద్, నాయకులు దొబ్బల వెంకటప్పయ్య, కూచిపూడిబాబు, గుడిపూడి కోటేశ్వరరావు, గాండ్ల సురేష్ తదితరులున్నారు.

పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ప్రతీ ఆదివారం జరిగే వారపు సంతకు ఆదివాసీల మాటున మావోయిస్టులు, కొరియర్లు, రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, ఉంజుపల్లి, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరు క్రాస్‌రోడ్, ఆర్ కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు వచ్చిపోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. అనుమానితులుగా భావిస్తూ పలువురిని అదుపులోకి తీసుకోగా నిర్ధారించుకున్న తరువాత విడిచిపెట్టారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో ఆదివారం సారపాక గాంధీనగర్‌లోని సత్యసాయి మోడల్ స్కూల్‌లో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు.ఈ వైద్య శిబిరాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్షుడు డీవీఎమ్ నాయుడు ప్రారంభించి మాట్లాడారు. వైద్యశిబిరంలో 500మంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సాయిరామ్, ఐటీసీ ఉన్నతాధికారులు శ్యామ్‌కిరణ్, రాంబాబు, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ నిఖిల్, డాక్టర్ అమృత, రంజిత్‌కుమార్, డేవిడ్ అలివర్, పాకాల దుర్గాప్రసాద్, బసప్ప రమేష్, మహేష్‌రెడ్డి, మురళీకృష్ణ, అరవిందన్, సాయిబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కాస్మొటిక్స్ చార్జీల పెంపుపై హర్షం

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వం గిరిజన గురుకులాల్లో డైట్, కాస్మొటిక్స్ చార్జీలు గతంలో కంటే 40 శాతం అదనంగా పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేయటంపై భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పేద విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, గిరిజన గురుకులాల ప్రిన్సిపల్ సెక్రెటరీ ఏ శరత్, సెక్రటరీ సీతాలక్ష్మితో పాటు ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు.

ఆర్థిక చేయూత

బూర్గంపాడు: అంజనాపురం గ్రామానికి చెందిన క్రీడాకారుడు ధరావత్ రమేష్ ఇటీవల ఆటల పోటీలలో తీవ్రంగా గాయపడ్డాడు. అతని మోకాలికి గాయం కావటంతో ఆపరేషన్ చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న క్రీడాకారుని పరిస్థితి తెలిసిన మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ప్రతినిధులు ఆదివారం రమేష్‌కు రూ.5 వేల సాయమందించారు. ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, కొంద్రు వెంకటేశ్వర్లు, కై పు నాగిరెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, నర్సిరెడ్డి, బాలు, కిషన్, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో సత్తా చాటుతాం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున సత్తా చాటుతామని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రం, దమ్మపేటలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాజీ ఎమ్మెల్యే మెచ్చా మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను 100 రోజుల్లోనే అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ, 300 రోజులు పూర్తవుతున్న నేటికి హామీలు అమలు కాలేదని అన్నారు. విద్య జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్, రైతుబంధుల పెంపుదల తదితర హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాబోయే జమిలీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. పామాయిల్ ధర పెరుగుదలలో గత ప్రభుత్వ కృషి ఉందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రావు జోగేశ్వరరావు, దారా యుగంధర్, దొడ్డా రమేష్, రావుల శ్రీను, సోయం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన


మట్టిని సేకరించే విధానాన్ని తెలియజేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

దమ్మపేట: భూసార పరీక్షలు నిర్వహించి, తద్వారా పంటలకు సరిపైన పోషకాలు అందించే ఎరువుల వాడకం తదితర అంశాలపై, రైతులకు అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. ఆదివారం జాతీయ సేవా పథకము కార్యక్రమం రెండో రోజులో భాగంగా మండలంలోని మల్లారం గ్రామంలో భూసార పరీక్షలకు మట్టి సేకరించే విధానం, ఆ భూమిలో ఉండే పోషకాల ఆధారంగా పండించాల్సిన పంటలు గూర్చి స్థానిక రైతులకు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రాంప్రసాద్ మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గూరించి వివరించారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ రెడ్డి ప్రియ మాట్లాడుతూ.. వ్యవసాయంలో జీవన ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శాస్త్రవేత్త టి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల వాడకం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కరకగూడెం: మండల పరిధిలోని వెంకటాపురం, పద్మాపురం గ్రామాల్లో ఆదివారం జిల్లా సహకార మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి స్థానిక రైతులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. గ్రేడ్-ఏ సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,320, గ్రేడ్‌బీ దొడ్డు రకానికి రూ.2,300 మద్దతు ధరతో పాటు సన్నాల క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెస్తున్నప్పుడు పట్టాదార్ పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు తప్పనిసరిగా తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమాల్లో ఏరియా ఇన్‌చార్జ్ దాసరి రవితేజ, కేంద్రాల నిర్వాహకులు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సేవారత్న అవార్డు గ్రహీతకు సన్మానం


నాసర్ పాషా దంపతులను సన్మానిస్తున్న బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్ ప్రాంతంలోని శ్రీవిద్యాభ్యాస (పూర్వ బాలవెలుగు) పాఠశాలలో బీఎస్‌ఏ జాతీయ సేవా రత్న అవార్డ్ గ్రహీత ఎస్‌డి.నాసర్‌పాషాకు అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ హాజరై మాట్లాడారు. సమీప ఆదివాసీ గిరిజన పేద అనాథలను, అన్నార్తులను చేరదీసి విద్యాబుద్దులు నేర్పుతున్న శ్రీవిద్యాభ్యాస నిర్వాహకులను అభినందించారు. అనంతరం సామాజిక కార్యకర్త, సింగరేణి సేవా సమితి సభ్యులు, సేవా రత్న అవార్డ్ గ్రహీత నాసర్‌పాషా-జమీలా బేగం దంపతులను శాలువాతో సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. అలాగే పాఠశాల భవన యజమాని అయితంరాజు యాదగిరి-లక్ష్మి దంపతుల సహకారంతో విద్యార్థులకు 72జతల స్కూల్ యూనిఫామ్ అందజేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఎస్‌ఏ జిల్లా అధ్యక్షులు నల్లా జ్యోతి, పాఠశాల నిర్వాహకులు బి జగన్మోహన్‌రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు షాబుద్దీన్, వి వెంకటరత్నం, టీవీఎంవి ప్రసాద్, కొడిపల్లి శ్రీలత, భూక్యా కిషన్, మంగీలాల్, శివరామకృష్ణ, సేవా కార్యదర్శి షేక్ షాకీరా, విద్యాజ్యోతి ట్రస్ట్ చైర్మన్ చంద్రమోహన్, అశ్వాపురం ఆరీఫా అండ్ రోష్నీ నిర్వాహకులు షెహనాజ్-మెహరాజ్ దంపతులు, కాంట్రాక్ట్ కార్మికులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సోలార్ ప్లాం ఉద్యోగులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి


మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌రావు

మణుగూరురూరల్: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు సాగునీరు అందించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో పడమటి సత్యవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన సీతారామ ప్రాజెక్ట్ డిజైన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రీడిజైన్ చేసి ఖమ్మం జిల్లాకు ప్రయోజనం చేకూరేలా కెనాల్‌ను నిర్మాణం చేపడుతోందని ఆరోపించారు. తద్వారా జిల్లా రైతులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. పినపాక నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలం చెందారని ఆరోపించారు. పాత డిజైన్ ప్రకారమే ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి జిల్లా రైతులకు సాగునీరు అందించాలని, లేని పక్షంలో సహించేది లేదన్నారు. అలాగే బీఎస్పీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పినపాక నియోజకవర్గ నూతన ఉపాధ్యక్షుడిగా కొప్పెర మహేష్, ప్రధాన కార్యదర్శిగా కాగితాల శ్రీనివాస్, కార్యదర్శిగా పరాల్ల గౌతమ్, కోశాధికారి జెట్టి నాగార్జునలను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక బీమా కలిగి ఉండాలి

దుమ్ముగూడెం: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ అందరూ విధిగా లేబర్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని మండల తెలంగాణ ప్రైవేట్ టెక్నీషియన్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు రాయపూడి సూరిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం యూనియన్ ఆధ్వర్యంలో ములకపాడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ యూనియన్ అభివృద్ధికి నెలవారీ సభ్యత్వంకట్టాలి అన్నారు. అదేవిధంగా ప్రతి సభ్యుడు లేబర్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి అందులోని ప్రయోజనాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. భద్రాచలానికి చెందిన మహేంద్ర ఎలక్ట్రికల్ యజమాని యూనియన్ అభివృద్ధికి టూల్ కిట్స్, రూ. 2116 రూపాయల నగదు అందజేశారు. ఉపాధ్యక్షుడు బిల్లా పాటి రాజు, జిల్లా కోశాధికారి ముక్కెర రాంబాబు, కార్యవర్గ సభ్యులు నిట్ట అబ్బులు, పూనెం ప్రభాకర్, పృథ్వీ, సాంబ, రంజిత్, పుష్పరాజు, రాజు, భద్రం, కమల్, శివ, గోపి పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ గెలుపు ఖాయం'


సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

దుమ్ముగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని, భవిష్యత్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. పార్టీ అభివృద్ధే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని, ప్రతీ కార్యకర్తకూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆదివారం మండలంలోని గంగోలు గ్రామంలోని వీవీఆర్ ఫంక్షన్ హాల్ జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమలు చేయలేని హామీలనిచ్చి కాంగ్రెస్ గద్దెనెక్కిందని విమర్శించారు. కార్యకర్తలు బీఆర్ఎస్‌ను గ్రామస్థాయిలో బలోపేతం చేసే దిశగా పనిచేయాలని కోరారు. డివిజన్ నాయకులు మానే రామకృష్ణ, సాగి శ్రీనివాస రాజు, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, సొసైటీ డైరెక్టర్ బొల్లి వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, నాయకులు జానీ పాషా, తునికి కామేష్, అపక వీర్రాజు, కొత్తూరి సీతారామారావు, జోగవెంకట రమణ(బుజ్జి.), వాగే వెంకటేశ్వరావు, దామెర్ల శ్రీనివాస్, కోత్త మల్లేష్,నోముల రామిరెడ్డి, సోడి జ్యోతి, మోతుకురి శ్రీకాంత్, లంకా శివ,జంజూరు జయసింహ, భూక్యా చందు, కాటిబోయిన వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదే..

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్ మొత్తం బీఆర్ఎస్ పార్టీదేనని, పార్టీని క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం జరిగిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వ విఫలమవ్వడాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి, పోరాటాలకు సిద్ధం చేయాలన్నారు. మండలంలో ప్రతి వార్డులో బీఆర్ఎస్ కమిటీలు వేసి క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం చేయాలని సూచించారు. నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ మానే రామకృష్ణ, ప్రభోద్ కుమార్, సునీల్ కుమార్, కోలా రాజు, ఉడతా రమేష్, పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు, ప్రేమ్ కుమార్, మోహన్‌రావు, సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మి, సూరిబాబు, అనీల్, ఏడుకొండలు, ప్రసాద్ పాల్గొన్నారు.